# జీపీల ఖజానాకు నిధుల జమ

- గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్న పన్ను వసూళ్లు
- గ్రామీణాభివృద్ధికి చర్యలు
- స్వచ్ఛందంగా చెల్లించాలని అధికారుల విజ్ఞప్తి


రాయపర్తిలో పన్నులు వసూలు చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

రాయపర్తి, డిసెంబర్ 17 : గ్రామ పంచాయతీల ఖజానాలకు కొద్ది రోజులుగా జోరుగా నిధులు జమ అవుతున్నాయి. మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో సిబ్బంది పన్ను వసూళ్లను వేగవంతం చేశారు. మండలంలోని అన్ని జీపీలకు నిధులు భారీ మొత్తంలో వచ్చి చేరుతున్నాయి. మండలంలో ప్రస్తుతం వరి కోతలు, నూర్పిడి, ధాన్యం అమ్మకాలు, వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. జనవరిలో యాసంగి పంటల సాగు పనులు ముమ్మరం కానుండడం, పంటల విక్రయాలతో రైతులకు ఆదాయం వచ్చింది. అధికారుల ఆదేశంతో జీపీల పన్నుల వసూళ్లపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించారు. అన్ని గ్రామాల్లో 15 రోజులుగా పన్నుల వసూళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కారోబార్లు, గ్రామ సిబ్బంది సహకారంతో రెండు బృందాలుగా అన్ని వార్డులు, కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నారు. మండల కేంద్రంలో బిల్ కలెక్టర్ రాంచంద్రయ్య, కార్యదర్శి బీ రాకేశ్‌కుమార్, వాటర్‌మన్ మచ్చ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో జీపీ సిబ్బందితో 3 బృందాలు 14 వార్డుల్లో పన్ను వసూలు చేస్తున్నారు. పన్నుల ద్వారా వచ్చిన ఆదాయం గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం, సమగ్రాభివృద్ధికి పాలక మండలి సత్వరమే చర్యలు తీసుకోనున్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు జీపీ పన్నులు సకాలంలో చెల్లించి గ్రామీణాభివృద్ధికి సహకరించాలని మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

**65శాతం పన్నులు వసూలు చేశాం..**



మండలంలోని 39 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు, గ్రామాల ప్రజా ప్రతినిధులకు జీపీల పన్ను వసూళ్లపై పలుమార్లు సమావేశాలు నిర్వహించి వివరించాం. జీపీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులతో మండలంలోని అన్ని గ్రామాల్లో పన్నులు వసూలు చేస్తున్నాం. మండలంలో ఇప్పటి వరకు 65 శాతం పన్నులు వసూలు చేశాం. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించాలి.

– తుల రామ్మోహన్, ఎంపీవో

**ప్రజల స్పందన బాగుంది..**



ప్రజలు బాధ్యతగా జీపీ పన్నులు చెల్లిస్తున్నారు. గ్రామ పంచాయతీ చేయాల్సిన పనులను ప్రజలు అడగడంతో పాటు జీపీకి కట్టాల్సిన పన్నులు కడుతున్నారు. మండల కేంద్రంలోని అన్ని వార్డుల్లో మా బృందాలు వేర్వేరుగా వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నాం. గ్రామస్తులు పన్నులు సక్రమంగా కట్టినప్పుడే తమ సమస్యల పరిష్కారం కోసం జీపీ పాలక మండలిని ప్రశ్నించే అవకాశం ఉంటుంది.

– కే రాంచంద్రయ్య, బిల్ కలెక్టర్, రాయపర్తి

## దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం ఎన్నిక

హనుమకొండ, డిసెంబర్ 17 : హనుమకొండ, వరంగల్ జిల్లాల దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా బిల్లా మహేందర్ ఎంపికయ్యారు. ఆదివారం హనుమకొండ సుబేదారిలోని ప్రాథమిక పాఠశాలలో సంఘం అడ్‌హక్ కమిటీ కన్వీనర్ బిల్లా మహేందర్ అధ్యక్షతన హనుమకొండ, వరంగల్ జిల్లాల దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. అనంతరం రాష్ట్ర బాధ్యులు నున్నప్పు నర్సమ్మ, బోనగిరి రాములు ఆధ్వర్యంలో సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల గౌరవ సలహాదారులుగా డాక్టర్ లక్కిరెడ్డి సత్యం, అధ్యక్షుడిగా బిల్ల మహేందర్, ప్రధాన కార్యదర్శిగా ఆకునూరి రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా ఏ సోమన్న, స్వరూప, కోశాధికారిగా వీ వాసుదేవరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా పీ వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా పీ రాధిక, వీ నారాయణరెడ్డి, ఉమారాణి, బీ రణధీర్‌రెడ్డి, ఎం శివాజీ, రాజమౌళి, ఏ కృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులుగా ఫసియొద్దీన్, వేణు, ప్రభాకర్, రవీందర్, కుమారస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు తిరుపతి, సుధాకర్, శ్రీదేవి, పార్వతి, శ్రీనివాస్, చేరాలు, ధనంజయ, శేషగిరి, సులోచన, ప్రణవి, సృజన, రాజేందర్, సాయి ప్రసాద్, సక్రూనాయక్, సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయులు

## రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**ఏఐఆర్‌ఆర్‌ఎఫ్ అధ్యక్షుడు శ్రీధర్**

కాజీపేట, డిసెంబర్ 17: రిటైర్డ్ రైల్వే పెన్షన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌ఆర్‌ఎఫ్) అధ్యక్షుడు శ్రీధర్ అన్నారు. కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలోని రైల్వే కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం డీఎస్ నకర పుట్టినరోజును పురస్కరించుకుని 41వ పెన్షనర్స్ డే రిటైర్డ్ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు. పెన్షన్‌దారులకు రావల్సిన అన్ని బకాయిలను ఇప్పించేందుకు పాటు పడుతానన్నారు. రైల్వే సీనియర్ డీఎంఈ స్వరాజ్‌కుమార్ అంతకు ముందు 90 ఏండ్లు నిండిన పలువురు పెన్షన్‌దారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీజిల్ లోకో షెడ్ సీనియర్ డీఎంఈ స్వరాజ్‌కుమార్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ రవీందర్ యాదవ్, రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ ప్రెసిడెంట్ శివకుమార్, రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, కాజీపేట బ్రాంచ్ రైల్వే పెన్షనర్లు కేవీ రావు, ఐలయ్య, లింగమూర్తి, భాస్కర్, కొమ్మాలు, కే నర్సింగరావు, కమిటీ సభ్యులు, రైల్వే రిటైర్డ్ కార్మికులు, వారి కుటుంబాలు పాల్గొన్నాయి.

## మడేలయ్య, ఈరమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన

కాజీపేట, డిసెంబర్ 17: దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనలో పాల్గొనడం సంతోషంగా ఉందని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట పట్టణం 62వ డివిజన్ సోమిడిలో సోమేశ్వర రజక సహకార సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న మడేలయ్య, ఈరమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన ముగింపు కార్యక్రమంలో ఆదివారం ఆయన హాజరయ్యారు. పూజారులు రాధాకృష్ణ శర్మ, వెంకటేశ్వరశర్మ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాస్యం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బస్వరాజు శ్రీమాన్, సంఘం సభ్యులు పాలడుగుల శివకుమార్, రామస్వామి, మనోహర్, రవి, సుధాకర్, కిషన్, సహకారం సంఘం, ఆలయ కమిటీ సభ్యులు, కుల పెద్దలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న దాస్యం వినయ్‌భాస్కర్

# ఆలయాల్లో ధనుర్మాస పూజలు ప్రారంభం

భీమదేవరపల్లి, డిసెంబర్ 17: కొత్తకొండ వీరభద్రస్వామి దేవస్థానంలో ఆదివారం ధనుర్మాసం పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవాచనం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరిపించారు. అనంతరం వేదమంత్రోచ్చారణల మధ్య ఘట(కుండ)పూజ కార్యక్రమాన్ని ఆరంభించారు. ఘటంతో ఆలయ ఈవో కిషన్‌రావు, అర్చకులు దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారికి సమర్పించారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా జరిగే వీరభద్రస్వామి బ్రహ్మోత్సవ ఆహ్వాన శుభ పత్రికను మొదటగా ఈవో కిషన్‌రావుకు అర్చకులు అందజేశారు. సూర్యుడు ధనస్సురాశిలోకి ప్రవేశించిన సందర్భంగా ధనుర్మాస ఆరంభ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పూజారి మొగిలిపాలెం రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో ఉపప్రధాన అర్చకులు రాజయ్య, అర్చకులు వీరభద్రయ్య, శ్రీకాంత్, రమేశ్, శివకుమార్, శరత్‌చంద్ర, గురుప్రసాద్, సిబ్బంది సంజీవరావు, రామకృష్ణారావు, రవీందర్, సందీప్, శ్రీధర్, రాజేందర్, భిక్షపతి, రాజు, భక్తులు పాల్గొన్నారు.

**సన్నూరులో..**

రాయపర్తి : మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు ఆరుట్ల రంగాచార్యులు, వెంకట రామకృష్ణాచార్యులు, వెంకట రమణాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారిని అలంకరించి కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.


భీమదేవరపల్లి: కొత్తకొండలో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న ఈవో కిషన్‌రావు, అర్చకులు

**ఆలయంలో ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి పూజలు**

ఆలయాన్ని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. ఆమె భర్త రాజా రామ్మోహన్‌రెడ్డి, అత్తయ్య, కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని పూజారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ తొర్రూరు అధ్యక్షుడు హమ్యానాయక్, మండల నాయకులు పాల్గొన్నారు.

## డీజిల్ కాలనీలో పడిపూజ

కాజీపేట, డిసెంబర్ 17 : పట్టణంలోని డీజిల్ కాలనీలో సంతోష్‌స్వామి నివాసంలో ఆదివారం పడిపూజకు కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్పస్వామి దీక్షతో క్రమశిక్షణ, దైవ భక్తి, మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. గురు స్వాములు ప్రసాద్ స్వామి, వెంకటేశ్ స్వామి, రాము స్వామి, రమేశ్ స్వామి, అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

## నేడు ప్రవాసుల సేవా కార్యక్రమాలు

హనుమకొండ, డిసెంబర్ 17: తెలంగాణ అమెరికా తెలుగు సంఘం (టీటీఏ), జ్యోతి రెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా వరంగల్ నగరంలో సోమవారం సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సేవా డేస్ ప్రోగ్రాం అడ్వైజరీ మెంబర్, టీటీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దూదిపాల జ్యోతిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సేవా డేస్‌లో భాగంగా హనుమకొండ పద్మాక్షి కాలనీలోని సరిగమ పార్క్ ఎదురుగా మైదానంలో ఉదయం11.30 గంటలకు రొమ్ము క్యాన్సర్, ఇతర మహిళల సమస్యలపై మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. పేద మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. అలాగే దివ్యాంగులకు వీల్ చైర్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ అమెరికా తెలుగు సంఘం ప్రతినిధులు, నగర ప్రముఖులు పాల్గొంటారని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## జాతీయస్థాయి యోగా పోటీలకు భాను

వర్ధన్నపేట, డిసెంబర్ 17 : ఈనెల 19, 20న పశ్చిమబెంగాల్‌లో జరుగనున్న జాతీయస్థాయి యోగా పోటీలకు మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన విద్యార్థి ఎస్ భాను ఎంపికైనట్లు యోగా గురువు పోశాల శ్రీనివాస్ తెలిపారు. చేర్యాల సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న భాను ఇటీవల నల్లగొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు.

## మంత్రి కొండా సురేఖకు సన్మానం

వరంగల్, డిసెంబర్ 17 : మంత్రి కొండా సురేఖను ఉమ్మడి వరంగల్ జిల్లా దేవాదాయ శాఖ అధికారులు ఆదివారం కలిశారు. వరంగల్ డిప్యూటీ జోనల్ కమిషనర్ టీ శ్రీకాంత్‌రావు, భద్రకాళీ దేవస్థానం ఈవో శేషుభారతి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీతలు మంత్రిని శాలువాతో సన్మానించారు. భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, రమేశ్ శర్మ, సిబ్బంది హరినాథ్, శరత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల ఇన్‌చార్జిగా రాజేశ్వర్‌రెడ్డి

వేలేరు, డిసెంబర్ 17 : కాంగ్రెస్ మండల ఇన్‌చార్జిగా పీచర గ్రామానికి చెందిన ఉద్యమకారుడు మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డిని నియమిస్తూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం రాజేశ్వర్‌రెడ్డికి పలువురు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల, గ్రామ అధ్యక్షులు కత్తి సంపత్, జుర్రు సంపత్, ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్, వెంకటేశ్వర్లు, రమేశ్, సంపత్, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

## మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శ

ఐనవోలు, డిసెంబర్ 17: మృతుల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఆదివారం పరామర్శించారు. మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కాత నాగయ్య, ఎంపీటీసీ టీ రమేశ్ అమ్మమ్మ బర్ర మల్లమ్మ ఇటీవల మృతి చెందారు. అరూరి వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, వైస్ ఎంపీపీ తంపుల మోహన్, సర్పంచ్‌లు కంజర్ల రమేశ్, శ్రీనివాస్‌రావు, వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, నాయకులు దేవేందర్, రాజు, సమ్మారావు, భిక్షపతి, అరుణ్, అబ్బాస్‌అలీ, అశోక్, రమేశ్, వెంకటేశ్వర్‌రావు, యాదగిరి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## వీఎంసీ కాలేజ్ మెరిట్ ఎగ్జామ్

హనుమకొండ, డిసెంబర్ 17:ఇంటర్ విద్యతో పాటు ఐఐటీ, జేఈఈ, నీట్ కోచింగ్ ఇచ్చేందుకు ఢిల్లీ కేంద్రంగా దేశంలో 60కి పైగా బ్రాంచ్‌లున్న వీఎంసీ హనుమకొండ ఏర్పాటు చేసిన కళాశాలలో ఆదివారం లెవల్ – 1 టాలెంట్ మెరిట్ పరీక్ష నిర్వహించినట్లు బ్రాంచ్ చైర్మన్ ఓదెల రమేశ్‌కుమార్ తెలిపారు. ఈ పరీక్షకు 1600 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్ష ద్వారా టాప్ 10 శాతం విద్యార్థులు లెవల్ – 2కు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. వరంగల్ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంలో హనుమకొండలో స్థాపించినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో వీఎంసీ కాలేజ్ క్యాంపస్ డీన్, సెంటర్ హెడ్, వైస్ ప్రిన్సిపాల్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, అడ్మిన్లు, సిబ్బంది పాల్గొన్నారు.


టాలెంట్ పరీక్షకు హాజరైన విద్యార్థులు